

నేడే తెలిసేది..!

జేఎన్‌టీయూ రెడీ..!

ఉదయం 8 నుంచే కౌంటింగ్

ఒక ఎంపీ, ఎనిమిది ఎమ్మెల్యే స్థానాలు

తొలి ఫలితం ఉరవకొండ..

తుది ఫలితం రాయదుర్గం

ఫ్యాన్ పార్టీకి చెమటలు పట్టిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కేంద్ర కౌంటింగ్ పరిశీలకులు మనీష్‌సింగ్, అజయ్‌నాథ్, అజయ్‌కుమార్, కలెక్టర్ తదితరులు

అనంతపురం టౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేయించారు. ఎస్పీ గౌతమిశాలి నేతృత్వంలో కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూలోని కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతపురం పార్లమెంటు స్థానంతోపాటు రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం(అర్బన్), కళ్యాణదుర్గం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ జేఎన్‌టీయూలో జరుగుతుంది. ప్రతి నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,36,316 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్ నిర్వహణకు 1,376 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు 116 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం, కళ్యాణదుర్గం, రాప్తాడు నియోజకవర్గాలకు 14 టేబుల్స్, ఉరవకొండ నియోజకవర్గానికి 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు. కేంద్రం నుంచి వచ్చిన కౌంటింగ్ పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్‌నాథ్, అజయ్‌కుమార్.. జేఎన్‌టీయూలో తిష్టవేసి పరిశీలిస్తున్నారు.

ఉదయం 8 గంటల నుంచే..

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకే మొదలవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను ప్రారంభిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు భారీగా పోలైనందున కౌంటింగ్ ఆలస్యం అవుతుంది. దీంతో దీనికి సమాంతరంగా 8:30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ మొదలవుతుంది. ఈవీఎంల కౌంటింగ్ ఒక్కో రౌండ్‌కు 20 నుంచి 25 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ లెక్కన ఈవీఎంల కౌంటింగ్ సాయంత్రం 5 నుంచి 6 గంటలలోపు పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తొలి ఫలితం ఉరవకొండదే..

మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉరవకొండ ఫలితం మొదట వెలువడనుంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 1,92,441 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు కౌంటింగ్‌కు ఇక్కడ ప్రత్యేకంగా 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు. 15 రౌండ్‌లలో లెక్కింపు పూర్తి అవుతుంది. ఆ తర్వాత 19 రౌండ్లలో కళ్యాణదుర్గం ఫలితం వస్తుంది. మూడో ఫలితం గుంతకల్లు, తాడిపత్రి కౌంటింగ్ 20 రౌండ్లలో తేలుతుంది. ఆ తరువాత శింగనమల, అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల ఫలితాలు 21 రౌండ్లలో వెలువడతాయి. చివరగా రాయదుర్గం ఫలితం వస్తుంది. ఇక్కడ జిల్లాలో అత్యధికంగా 22 రౌండ్‌లపాటు లెక్కింపు కొనసాగుతుంది.

ఫ్యాన్‌కు పోస్టల్ బ్యాలెట్ ఉక్కపోత

అధికార వైసీపీకి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ చెమటలు పట్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ ఓట్లు తమకు వ్యతిరేకంగా పోలవుతాయని భావించిన ఆ పార్టీ అభ్యర్థులు.. అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. చివరకు చెల్లని ఓట్ల సంఖ్య పెంచేందుకూ ప్రయత్నిస్తున్నారు. కూటమి విజయం తథ్యమని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేయడంతో ఫ్యాన్ పార్టీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై గగ్గోలు పెడుతోంది. వైసీపీ అభ్యర్థుల ఓటమిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకం కానున్నాయని భావిస్తున్నారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సమయంలో ఆ పార్టీ ఏజెంట్లు గొడవలకు దిగి, గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల అధికారులు, పోలీసులు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు.



కౌంటింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం



అనంతపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నరాలు తెగే ఉత్కంఠకు తెరపడే సమయం వచ్చింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ప్రజాతీర్పు మరికొన్ని గంటల్లో బహిర్గతం కానుంది. ఓటరు జాబితా తయారీ మొదలు.. పోలింగ్ ముగిసేవరకూ మునుపెన్నడూ లేనన్ని ప్రలోభాలు.. బెదిరింపులు, దాడులు చోటు చేసుకున్నాయి. అన్నింటినీ ఓ కంట కనిపెట్టిన ఓటరు.. మీట నొక్కి తన నిర్ణయం ప్రకటించాడు. అదేమిటో మంగళవారం తేలిపోతుంది. జిల్లాలోని 8 అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గం ఫలితాలు సాయంత్రానికల్లా వచ్చే అవకాశం ఉంది. ఒకటి రెండు నియోజకవర్గాలు ఆలస్యమైనా.. రాత్రికి మాత్రం తుది ఫలితాలు అధికారికంగా బయటకు వస్తాయి. మే 13న పోలింగ్ ముగిశాక.. మూడు వారాల పాటు ఫలితాల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. చాలా మంది అభ్యర్థులు పోలింగ్ ముగిసింది మొదలు నిద్ర లేని రాత్రులు గడిపారు. జనం సైతం గెలుపోటములపై చర్చలకు దిగారు. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌పై సైతం చర్చ కొనసాగింది. గెలుపోటములు ఎలా ఉంటాయోనన్న సందిగ్ధంలో పడ్డారు. మెజార్టీ సర్వేలు కూటమిదే అధికారమని తేల్చడంతో అధికార వైసీపీ అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. బయటికి మాత్రం గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.

కూటమిలో ధీమా

టీడీపీ కూటమి అభ్యర్థులు జిల్లాలో మెజార్టీ స్థానాలు తమవేనన్న ధీమాలో ఉన్నారు. పోలింగ్ ముగిసింది మొదలు తెలుగు తమ్ముళ్లల్లో జోష్ కనిపిస్తోంది. పోలింగ్ ఎక్కువ శాతం నమోదుకావడం, ఉద్యోగులు, నిరుద్యోగ యువత అత్యధికంగా పోలింగ్‌లో పాల్గొనడం తమకు అనుకూలమని వారు భావిస్తున్నారు. మరోవైపు సూపర్‌సిక్స్ పథకాలు మహిళలను పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చేశాయని అంటున్నారు. అందుకే ఎంపీతోపాటు మెజార్టీ అసెంబ్లీ స్థానాలు కూటమికే దక్కుతాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఆ తరువాత 8.30 గంటలకు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు మొదలౌతుంది. మొదటి రౌండులో మంచి మెజార్టీ సాధించినవారే విజయం సాధిస్తారని భావిస్తున్నారు. తొలి రౌండ్‌తోనే ఏఏ స్థానాలు ఎటువైపు వెళతాయో దాదాపుగా తేలిపోతుందని విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాల్లో వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఓట్ల రూపంలో బయటపడుతుందని కూటమి అభ్యర్థులు అంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమ గెలుపును ఖరారు చేస్తాయని కూడా బలంగా నమ్ముతున్నారు.



జేఎన్‌టీయూలోకి వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తోళ్లు.. పాతోళ్లు..

సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపిక విషయంలో వైసీపీ, కూటమి ఎత్తుకు పై ఎత్తులు వేశాయి. వైసీపీ కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చింది. టీడీపీ అధినాయకత్వం ఢీ.. అన్నట్లుగా కొత్త అభ్యర్థులను రంగంలోకి దించింది.



జేఎన్‌టీయూ ప్రహరీపై ఇనుప కంచె

- జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఇప్పటి వరకూ ఓటమి ఎరుగని మాజీ మంత్రి పరిటాల సునీతను రాప్తాడులో కూటమి అభ్యర్థిగా బరిలో దించారు. వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పోటీలో ఉన్నారు.
- అనంతపురం అర్బన్ నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కొత్తగా బరిలో దించారు. వైసీపీ నుంచి మరోమారు సిటింగ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డినే పోటీలో నిలిపారు.
- కళ్యాణదుర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా అమిలినేని సురేంద్రబాబును కొత్తగా పోటీలో నిలిపారు. వైసీపీ నుంచి అనూహ్యంగా అనంతపురం ఎంపీ రంగయ్యను అసెంబ్లీ బరిలో నిలిపారు.
- రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును మరోమారు టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేయించారు. వైసీపీ నుంచి అనూహ్యంగా సిటింగ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని తప్పించి.. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందురెడ్డిని బరిలో నిలిపారు.
- ఉరవకొండలో మరోసారి ఆ ఇద్దరి మధ్యనే పోటీ నెలకొంది. టీడీపీ కూటమి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి బరిలో ఉన్నారు.
- గుంతకల్లు నుంచి వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డికి మరో అవకాశం ఇచ్చారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన మంత్రి గుమ్మనూరు జయరాంను బరిలో దించారు.
- శింగనమల నుంచి వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని తప్పించి.. కొత్త అభ్యర్థి వీరాంజనేయులును పోటీలో నిలిపారు. కూటమి టీడీపీ అభ్యర్థిగా రెండోసారి బండారు శ్రావణిశ్రీకి అవకాశం కల్పించారు.
- తాడిపత్రి నియోజకవర్గం నుంచి మరోసారి ఆ ఇద్దరే పోటీపడ్డారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా జేసీ అస్మిత్‌రెడ్డి పోటీ చేశారు. వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బరిలో దిగారు.

కౌంటింగ్‌కు సిద్ధమైన యంత్రాంగం

మూడు వారాల ఉత్కంఠకు నేటితో తెర

వైసీపీ.. పైకి గంభీరం.. లోలోన గుబులు

గెలుపుపై కూటమి అభ్యర్థుల్లో విశ్వాసం

జిల్లావ్యాప్తంగా భారీ భద్రతా చర్యలు



జేఎన్‌టీయూ మార్గంలో కెమెరా కన్ను..

ఇవీ.. ఓట్లు..!

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 26,900 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. జిల్లావ్యాప్తంగా 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 9,97,792 మంది పురుషులు, 10,20,124 మంది మహిళలు. 246 మంది ఇతరులు. ఓటు హక్కు వినియోగించుకున్నవారు 16,36,648 మంది. వీరిలో 8,17,536 మంది పురుషులు, 8,19,004 మంది మహిళలు.

భారీ భద్రత

పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కౌంటింగ్ ప్రశాంతంగా సాగేలా, శాంతిభద్రతల పరిరక్షణ దిశగా కలెక్టర్, ఎస్పీ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. భారీ పోలీసు బలగాలను మోహరించారు. ఎస్పీ గౌతమిశాలి నేతృత్వంలో కౌంటింగ్ కేంద్రం వద్ద దాదాపు 3 వేల మంది భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 18 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 90 మంది ఎస్ఐలు, 2 వేల మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, హోంగార్డులు, దాదాపు 1000 మందితో కూడిన 26 ప్లటూన్‌ల కేంద్ర బలగాలు జిల్లాలో మోహరించాయి. కౌంటింగ్ ఏజెంట్లయినా, అభ్యర్థులైనా చిన్నపాటి ఘర్షణలకు పాల్పడినా వెంటనే అరెస్టు చేస్తామని ఇప్పటికే ప్రకటించారు.

మందు జాగ్రత్త..!





కలెక్టరేట్ సమీపంలోని మద్యం షాపు వద్ద క్యూకట్టిన మందుబాబులు, శ్రీకంఠం సర్కిల్‌లో బంద్ చేసిన మద్యం దుకాణం

కౌంటింగ్ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను సోమవారం బంద్ చేశారు. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది షాపులకు సీల్ వేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో సోమవారం ఉదయం నుంచి, మిగతా నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల నుంచి బంద్ చేయించారు. పోలింగ్ రోజు అల్లర్లను దృష్టిలో ఉంచుకొని తాడిపత్రి నియోజకవర్గంలో ఈ నెల 5వతేదీ దాకా మద్యం షాపులను మూసివేయాలని నిర్ణయించారు. మిగతా నియోజకవర్గాల్లో ఈనెల 4వతేదీ దాకా మూసేస్తారు. దీంతో మద్యం ప్రియులు 'మందు' జాగ్రత్తలు తీసుకున్నారు. మద్యం దుకాణాలకు క్యూ కట్టి కొనుగోలు చేశారు. ఫోన్ పే ద్వారా మాత్రమే అమ్మకాలు సాగించారు. నగదుకు మద్యం ఇచ్చేది లేదనడంతో పలువురు నిట్టూరుస్తూ వెనుదిరిగారు. ఎన్నికల నేపథ్యంలో రోజువారి టార్గెట్ పూర్తి కావడంతో కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటలకే మద్యం షాపులు మూసివేశారు. జిల్లాలో సోమవారం ఎక్కడా మందుబాబులకు అవసరమైన బ్రాండ్లు లభించలేదు. ఖరీదైన బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉంచారు. అంత సొమ్ము వెచ్చించలేనివారు నిరాశతో వెనుదిరిగారు.

- అనంతపురం అర్బన్

ఫామ్ హౌస్‌లు ఫుల్

గెలిస్తే.. సంబరాలకు ఏర్పాట్లు

గార్లదిన్నె, జూన్ 3: ఎన్నికల ఫలితాలు మంగళవారం తేలనుండటంతో అంతటా హడావుడి కనిపిస్తోంది. అనంతపురం నగరంలోని లాడ్జిలలో ఉంటూ.. ఎంజాయ్ చేద్దామనుకున్నవారికి పోలీసులు అడ్డుకట్ట వేశారు. దీంతో నాయకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు కౌంటింగ్ వివరాలు తెలుసుకునేందుకు వైసీపీ, కూటమి నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్య అనుచరగణంతో ఫామ్ హౌస్‌లు, గెస్ట్ హౌస్‌లు, రహస్య స్థావరాలకు చేరుకున్నారు. శింగనమల ఎమ్మెల్యేగా ఎవరు ఎన్నిక అవుతారన్న ఉత్కంఠ నెలకొంది. దీనికి కారణం.. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ ఉండటమే. ఈ ఎన్నికల్లో ఇరుపార్టీల నేతలు పట్టుకోసం తీవ్రంగా ప్రయత్నం చేశారు. ఎన్నికలకు మునుపు రెండు పార్టీల్లో అసమ్మతి రాగం వినిపించినా.. ఆ తరువాత సర్దుకుపోయారు. అధికారాన్ని కాపాడుకునేందుకు వైసీపీ, అధికారాన్ని చేజిక్కించుకునేందుకు టీడీపీ కూటమి పోటాపోటీగా తలపడ్డాయి. ఫలితాలు వెలుబడే సమయం అసన్నమవడంతో రెండు పార్టీల నేతల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. తమ అభ్యర్థే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేసినా.. లోలోన ఆందోళన చెందుతున్నారు. ఈ ఫలితాలతో తమ భవిష్యత్తు ముడిపడి ఉందని రెండు పార్టీలవారూ భావిస్తున్నాయి. గెలిచిన వెంటనే సంబరాలు చేసుకునేందుకు కూడా తమ స్థావరాల వద్ద ఏర్పాట్లు చేసుకున్నారని తెలిసింది.

ప్రశాంతంగా ముగిద్దాం..!

గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకోండి

పోలీసులకు ఎస్పీ గౌతమి శాలి ఆదేశం



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 3: కౌంటింగ్ ప్రశాంతంగా ముగించేందుకు పక్కాగా బందోబస్తు చేపట్టాలని ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన జరగకూడదని అన్నారు. కౌంటింగు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులతో సోమవారం జేఎన్టీయూలో ప్రత్యేకంగా ఆమె సమావేశమయ్యారు. బందోబస్తు విధుల్లో ఏమి చేయాలో, ఏమి చేయకూడదో దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ రోజు విధుల్లో ఉండే టూవీలర్ మొబైల్ పార్టీలు, స్ట్రాంగ్ రూంల వద్ద బందోబస్తు, జేఎన్టీయూ చుట్టూ పహారా కాస్తున్న పెట్రోలింగ్ పార్టీలు, ట్రైలేన్ పికెట్లు, జేఎన్టీయూ వైపు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వర్సిటీ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద తనిఖీలు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాల్లోకి రిటర్నింగుల అధికారుల అనుమతి పత్రం లేనిదే ఎవరినీ అనుమతించవద్దని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు, ఆర్వో, ఏఆర్వో, ఇతర అధికారులు, మీడియా ప్రతినిధులు నిర్దేశిత మార్గాల ద్వారానే కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, బాల్ పెన్/పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మినహా ఏవీ అనుమతించవద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయని అన్నారు. జిల్లా కేంద్రంలో మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ బృందాలు, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలు అప్రమత్తంగా తిరగాలని సూచించారు. జేఎన్టీయూ పరిసరాల్లో ర్యాలీలు, ఊరేగింపులు నిషిద్ధమని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులపై రిహార్సల్స్

కౌంటింగ్ రోజున బందోబస్తు ఎలా నిర్వహిస్తారో తెలుసుకుని, లోటుపాట్లను సరిదిద్దుకునేందుకు సోమవారం రిహార్సల్స్ నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని విధుల్లో ఉంచారు. కౌంటింగ్ ముగిసేవారకూ జేఎన్టీయూతోపాటు పరిసర ప్రాంతాలు పోలీసుల ఆధీనంలో ఉండేలా వివిధ రకాల విధుల్లో సిబ్బందిని పురమాయించారు.



కణేకల్లు మండలం మాల్యం వద్ద ప్రవహిస్తున్న వేదవతినది

జిల్లాలో విస్తారంగా వర్షాలు

వాగులు, వంకలకు జలకళ

నీట మునిగిన ఉద్యాన పంటలు



రాప్తాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పండమేరు

నైరుతి.. శుభారంభం

అనంతపురం అర్బన్, జూన్ 3: నైరుతి రుతుపవనాలు ఆరంభంలోనే మేఘాల నిండా నీటిని మోసుకొచ్చాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆదివారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రాప్తాడు సమీపంలోని పండమేర వంక పొంగిపొర్లింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బొమ్మనహాల్ మండలంలో వేదవతి హగరి నదికి భారీగా నీరు చేరింది. ఉద్దేహాల్ వద్ద వంతెనపై వరదనీరు పొంగిపొర్లడంతో బళ్లారి, కళ్యాణదుర్గం ప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కణేకల్లు మండలంలోనూ భారీ వర్షానికి వేదవతి హగరి నది పొంగిపొర్లింది.

బొమ్మనహాళ్‌లో అత్యధికం..

బొమ్మనహాళ్ మండలంలో ఆదివారం రాత్రి అత్యధికంగా 91.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప 84.2, కణేకల్లు 80, గుత్తి 62.6, పెద్దవడుగూరు 56.2, ఆత్మకూరు 50.4, డి. హీరేహాళ్ 50, కూడేరు 46.2, రాయదుర్గం 43.2, నార్పల 42.4, రాప్తాడు 40.4, గార్లదిన్నె 37.8, పామిడి 35.4, వజ్రకరూరు 35.2, యాడికి 32.0, శింగనమల 30.8, కళ్యాణదుర్గం 23.4, అనంతపురం నగరం 20.2, ఉరవకొండ 17.4, కంబదూరు 16.4, విడపనకల్లు 15.8, బ్రహ్మసముద్రం 12.2, గుంతకల్లులో 11.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 9.4 మి.మీ. వరకూ వర్షపాతం నమోదైంది.

భారీగా పంటనష్టం

భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 17.90 హెక్టార్లల్లో రూ.34.72 లక్షల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అరటి, మామిడి, బొప్పాయి, టమోటా పంటలు ధ్వంసమయ్యాయి. బొమ్మనహాళ్ మండలంలో 200 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. రూ.60 లక్షలకుపైగా పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కనగానపల్లి మండలంలో కనగానపల్లి, ముత్తవకుంట్ల, తల్లిమడుగులు, యలకుంట్ల, తగరకుంట, బద్దలాపురం తదితర గ్రామాల్లో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. కనగానపల్లిలో రైతు బట్టా నాగభూషణం 12 ఎకరాల్లో సాగుచేసిన అరటి మొక్కలు నీటమునిగాయి. రూ.10 లక్షల దాకా నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. (మరిన్ని వివరాలు 7లో...)

మేఘ గర్జన

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- నీట మునిగిన అరటి, పత్తి పంటలు
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు


కొళగానహళ్లి వద్ద నీట మునిగిన పత్తిపంట

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వానలు దంచికొట్టాయి. పలు మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతులు సాగు చేసిన అరటి, మొక్కజొన్న, పత్తి పంటలు నీట మునిగాయి. వానలకు ఈదురు గాలులు తోడవడంతో పలు చోట్ల చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ముంగారు వానలు మురిపిస్తుండటంతో అన్నదాతలు ఆనందంగా సేద్యపు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

వేదవతి హగరి పరవళ్లు


వంతెనపై నుంచి పారుతున్న వేదవతి హగరి నది

బొమ్మనహాళ్: భారీ వర్షాలకు మండ లంలో వాగులు, వంకలు వేదావతి హగరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వేదవతి హగరికి భారీగా వరదనీరు రావడంతో ఉ ద్దేహాళ్ గ్రామం వద్ద వంతెనపై వరదనీరు పారాయి. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి హెచ్చెల్సీ ప్రధాన కాలువ 119/400 కి.మీ. వద్ద యూటీ అండర్ టెన్నల్ చానల్‌కు గండిపడింది. దీంతో కాలువలో నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించాయి. కొళగానహళ్లి వద్ద కబ్బాలివంక భారీ వరదనీరుతో ఉధృతంగా ప్రవహించింది. మండలంలో 91 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలంలోని ఉద్దేహాళ్, గౌనూరు, రంగాపురం క్యాంపు, కొళగానహళ్లి తదితర గ్రామాలలో సాగైన పత్తి, మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయి.

కణేకల్లు: మండలంలో ఆదివారం రాత్రి 80 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వేదవతి హగరి ఉధృతికి కణేకల్లు - ఉరవకొండ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఇంకా.. ఐదు రోజులు వానలు!

బుక్కరాయసముద్రం: నైరుతి పవనాలు రాయలసీమకు తాకాయి. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల రానున్న 5 రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదు అవుతున్న విషయాన్ని ఐఎండీ వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. గత ఏడాది కంటే నైరుతి పవనాలు అనుకున్న సమయం కంటే మూడు రోజులు ముందే వచ్చాయని వాతావరణ నిపుణులు తెలిపారు.

పెద్దవడుగూరులో భారీ వర్షం


పొంగిపొర్లుతున్న పందులవాగు

పెద్దవడుగూరు: మండలంలో ఆదివారం రాత్రి ఉరుము లు, మెరుపులతో కూడి న భారీ వర్షం కురిసింది. దీంతో మండలకేంద్రంలోని పందులవాగు ఉధృతంగా ప్రవహించింది. మండలంలో 56.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వీధులన్నీ జలమయం..


రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

కళ్యాణదుర్గం: పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధా న వీధులన్నీ జలమ యమయ్యాయి. రూరల్ ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన టమోటా, కర్బూజా, కలింగర పంటలు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. కంబదూరు మండలం జల్లిపల్లిలో కోతకొచ్చిన కర్బూజ, కలింగర పంటలు భారీ స్థాయిలో దెబ్బతిన్నాయి.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

పామిడి: గాలి వాన దెబ్బకు పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డు, బీసీసీ రోడ్డులలో విద్యుత్ తీగలు తెగిపోయాయి. గుత్తిరోడ్డులోని సబ్ స్టేషన్ ఎదురుగా ఓ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం నేలకూలింది. దీంతో పట్టణంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. మండల పరిషత్ కార్యాలయంలో చెట్టు నేలకూలడంతో గేటు దిమ్మలు ఒరిగాయి.


పామిడిలో నేలకూలిన విద్యుత్ స్తంభం

పండమేరు పరవళ్లు...

రాప్తాడు: భారీ వర్షానికి పండమేరు వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. రాప్తాడు మండలంతో పాటూ పండమేరు వంక పైతట్టు ప్రాంతంతో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పండమేరు వంకలోని చెక్‌డ్యాంలు నీటితో నిండి నీరు దిగువకు ప్రవహిస్తోంది. సోమవారం ఉదయంకు వర్షపు నీరు రాప్తాడుకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మొదటి సారి రాప్తాడులో పండమేరు వంక ప్రవహించడంతో సర్పంచ్ సాకే తిరుపాలు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సోమవారం గంగపూజ నిర్వహించారు.


పండమేటి రాయుడి ఆలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

నీటమునిగిన అరటి మొక్కలు


కనగానపల్లి రైతు బట్టానాగభూషణం పొలంలో నీట మునిగిన అరటిమొక్కలు

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలంలోని ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కనగానపల్లి, ముత్తవకుంట్ల, తల్లిమడుగులు, ఏలకుంట్ల, తగరకుంట, బద్దలాపురం తదితరగ్రామాల్లో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు పొంగిపోర్లాయి. కనగానపల్లిలో రైతు బట్టా నాగభూషణం 12 ఎకరాల్లో సాగుచేసిన అరటిమొక్కలు నీటమునిగాయి. మండలవ్యాప్తంగా 43.2మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెరువులకు జలకళ

బెళుగుప్ప: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఆదివారం అర్ధరాత్రి నుంచి కురవడంతో మండలంలోని పలు చెరువులకు జలకళ వచ్చింది. మండలంలో 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప కల్వర్టుపై నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీరంగాపురం, బెళుగుప్ప మంగోటి, నాగుల చెరువులకు భారీగా వర్షపు నీరు చేరింది. నీటి ఉధృతికి బెళుగుప్ప వద్ద పెద్దవంక కల్వర్టు దెబ్బతింది.


బెళుగుప్ప సమీపంలో పెద్దవంక కల్వర్టుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

బుక్కరాయసముద్రం చెరువులోకి చేరిన నీరు...


బీకేఎస్ చెరువులోకి వస్తున్న నీరు

బుక్కరాయ సముద్రం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గాలి, వాన దాటికి పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షానికి బుక్కరాయసముద్రం చెరువులోకి నీరు చేరుతోంది.

అనంతపురంరూరల్: మండలంలోని మన్నీల, కందుకూరు, క్రిష్ణంరెడ్డిపల్లి, చియ్యేడు, ఉప్పరపల్లి ప్రాంతాల్లో పదును వర్షం కురిసింది. అలాగే ఆలమూరు, చిన్నంపల్లి, కామారుపల్లి, కురుంటు, కొడిమి, నరసనేకుంట ప్రాంతాల్లో ఓ మోస్తరు వాన పడింది. మండలంలో 20.2మి.మీ వర్షం పాతం నమోదైంది.

ఆగస్టులో జిల్లాకు హంద్రీనీవా నీరు: ఎస్ఈ


రిజర్వాయర్ల గేట్లు పరిశీలిస్తున్న ఎస్ఈ దేసేనాయక్, ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: జిల్లాకు ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలవకు నీరు వచ్చే అవకాశం ఉందని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ తెలిపారు. రెండు రోజులు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని జీడిపల్లి, చెర్లోపల్లి, మారాల, గొల్లపల్లి రిజర్వాయర్లను పరిశీలించినట్లు ఎస్ఈ తెలిపారు. శ్రీశైలం డ్యాం నుంచి గతేడాది కాలువకు 21 టీఎంసీలు నీరు వదలగా, జిల్లాకు 17 టీఎంసీలు చేరిందన్నారు. 4 టీఎంసీల నీరు భూమిలోకి ఇంకిపోయిందన్నారు. హంద్రీనీవా కాలువతో పాటు రిజర్వాయర్ల పటిష్టత, గేట్ల నాణ్యతను పరిశీలించి ప్రభుత్వానికి త్వరలో నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు. కాలువలు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా నీటి విడుదలలోపు కాలవలు, రిజర్వాయర్లు, గేట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈసారి సాధ్యమైనంతవరకు శ్రీశైలం డ్యాంనుంచి అధికంగా జిల్లాకు నీటిని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఈఈ మురళి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.38 వేలు

అనంతపురం రూరల్, జూన్ 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 720 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

7 నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్లు

అనంతపురం సెంట్రల్, జూన్ 3: పాలిసెట్‌లో అర్హతసాధించి కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 7 నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని పాలిసెట్ కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కౌన్సెలింగ్ తేదీలను వాయిదా వేసినట్లు స్టేట్ కన్వీనర్ నాగరాణి ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ 6న, వెబ్ ఆప్షన్లు 7న, సీట్ల కేటాయింపు 13న, సెల్ఫ్ రిపోర్టింగ్ 14న ప్రారంభ మౌతునాయని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.

అయోధ్యలో 'పురం' కళాకారుల ప్రతిభ

- విద్యాధరికి కళావిభూషణ్ పురస్కారం

హిందూపురం అర్బన్, జూన్ 3: అయోధ్యలో సత్యసాయి జిల్లా హిందూపురం నృత్య కళాకారులు ప్రతిభ చాటారు. ఆదివారం అయోధ్యలో రామసేతు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీల్లో హిందూపురం నృత్య కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, కథకళి, మోహినీ అట్టం, ఫోక్ డ్యాన్స్‌లకు 75 బృందాలు వచ్చాయి. హిందూపురం నుంచి గతిస్వం కూచుపూడి కళాక్షేత్రం సమూహం నుంచి 10 మంది పాల్గొన్నారు. పోటీల్లో సబ్‌జూనియర్స్ గ్రీష్మ, సమన్విత లకు మొదటి స్థానం రాగా మోక్షిత, జూనియర్స్‌లో స్కందశ్రీ, శ్రీకృతి మోక్ష మొదటి స్థానంలో రెఖ, మధురిమ రెండవ స్థానంలో నిలిచారు. అలాగే సీనియర్ విభాగంలో ప్రవల్లిక మొదటి స్థానంలో నిలువగా, శ్రేయ రెండో స్థానంలో నిలిచింది. మోదటి మూడు స్థానాల్లో హిందూపురం కళాకారులు ప్రతిభ చాటినందుకు గతిస్తత్వం గురువు దుర్గా విద్యాధరికి యూపీ ప్రభుత్వం రామసేతు ఆర్గనైజేషన్ వారు కళావిభూషణ్ అవార్డును ప్రదానం చేశారు. ప్రతిభా కళాకారులకు ధ్రువపత్రాలు, మెమెంటోలు అందించి అభినందించారు.


ప్రశంసా పత్రాలతో నృత్యకళాకారిణులు

పోలింగ్ ముగిసిందనే జీతాలివ్వలేదా?

- గత నెలలో ఒకటో తేదీనే వేతనాలు
- ఈనెల మరిచిన ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్, జూన్ 3: ఐదేళ్లగా జీతాలకోసం ఎదురుచూసేట్టు చేసిన వైసీపీ ప్రభుత్వం.. గత మే నెల మాత్రం ఒకటో తేదీనే ఠంచనుగా వేతనాలు జమచేసింది. అయితే ఈనెల మాత్రం మరిచిపోయిందని జేఎన్‌టీయూ ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఓటు వేసేశారు, ఎన్నికలు ముగిసిపోయాయని ఇక వారితో పనేంటని ప్రభుత్వం జీతాలివ్వలేదని మండిపడుతున్నాయి. ఏరు దాటి తెప్పను తగలేసినట్లుగా ప్రభుత్వ తీరు మారిందని వాపోతున్నాయి. గల్లాపెట్టె ఖాళీచేసి అప్పులు తీసుకువచ్చిన తరువాత తమ జీతాలు జమజేయడం అలవాటుగా చేసుకున్న ప్రభుత్వం ఎన్నికల అనంతరం చేతులెత్తేసిందని మండిపడుతున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడబోయే ప్రభుత్వమే జీతాలు ఇచ్చుకుంటుందన్న భావనతో విస్మరిస్తోందని అంటున్నాయి. రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలివ్వడం అలవాటుచేసుకున్న వైసీపీ ప్రభుత్వం.. మే నెల మాత్రమే ఒకటో తేదీన జమచేయడం ఇందుకు నిదర్శనమంటున్నాయి.

అధికార ముసుగు...



జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు కొంతమంది వైసీపీకి భజనపరులుగా మారిపోయి తమ సంక్షేమాన్ని విస్మరించారని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. జీతాలివ్వాలని కోరినప్పుడల్లా ట్రెజరీలో పెండింగ్, సీఎఫ్ఎంఎస్‌లో ఉన్నాయి, రిజర్వ్‌బ్యాంక్ ఓకే చేయాలి ఇలా అనేక సాకులు చెప్పారంటూ గుర్తుచేసుకుంటున్నాయి. అదే అధికారులే.. మే నెలలో జీతాల్వికపోతే ఉద్యోగులు ఓటు ద్వారా వారి ప్రతాపాన్ని చూపుతారని ట్రెజరీ, సీఎఫ్ఎం శాఖలతో మాట్లాడి వేతనాలు జమ చేయించారని పేర్కొంటున్నాయి. అదే చొరవ గతంలోనూ, ప్రస్తుతం ఎందుకు చూపలేకపోయారని ప్రశ్నిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమం కన్నా వారి పదవులే ముఖ్యమన్న రీతిలో వ్యహరించారని మండిపడుతున్నాయి.

జిల్లా విడిచి వెళ్లండి..!

- వైసీపీ, టీడీపీ వర్గీయులకు నోటీసులు
- కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా బహిష్కరణ

అనంతపురం క్రైం, జూన్ 3: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీ, వైసీపీ వర్గీయులతోపాటు రౌడీషీట్లు ఉన్న పలువురిని పోలీసులు జిల్లా నుంచి బహిష్కరించారు. జాబితాను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా రౌడీషీటర్లకు సోమవారం నోటీసులు ఇచ్చారు. ఈనెల 25వరకు జిల్లాలోకి ప్రవేశించకూడదని ఆదేశించారు. అత్యధికంగా తాడిపత్రి నియోజకవర్గంలో 60 మందిని జిల్లా నుంచి బహిష్కరణ చేసినట్లు సమాచారం. అనంతపురంలో నగరంలో ముగ్గురిని బహిష్కరించారు. అనంతపురం అర్బన్ పరిధిలో రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, చంద్రదండు వ్యవస్థాపకులు ప్రకాష్‌నాయుడు, రాప్తాడు నియోజకవర్గంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, వైసీపీ నాయకుడు, తోపుదుర్తి ఎంపీటీసీ పాలచర్ల పోతులయ్య, తోపుదుర్తి ఓబిరెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇద్దరిని బహిష్కరించారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి 35 మందిని బహిష్కరించారు. వీరిలో కదిరి నియోజకవర్గానికి చెందినవారు నలుగురు ఉన్నారు. వైసీపీ కదిరి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పూల శ్రీనివాసరెడ్డితో, పార్టీ నాయకుడు అల్తాఫ్‌ను జిల్లా నుంచి బహిష్కరించారు. టీడీపీ కదిరి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ ఎంపీపీ విజయ్‌రెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించారు.

డీఐజీ పర్యవేక్షణలో తాడిపత్రి

తాడిపత్రి పట్టణంలో ఎన్నికల అల్లర్ల నేపథ్యంలో ఆ నియోజకవర్గంపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. డీఐజీ స్థాయి అధికారి రాహుల్ దేవ్‌శర్మను తాడిపత్రి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆయన విధుల్లో చేరి, అక్కడి పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

ఉదయమే వచ్చేయండి..

కౌంటింగ్ నేపథ్యంలో గొడవలు జరగకుండా చూసుకునేందుకు పోలీసులు తంటాలు పడుతున్నారు. 'మంగళవారం ఉదయం ఆరు గంటలకే పోలీస్ స్టేషన్‌కు వచ్చేండి. టిఫిన్, భోజనం మేమే పెడతాం' అని వివిధ పార్టీల నాయకులకు సూచించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం ఇద్దరు ముఖ్య నాయకులకు ఇలాంటి సూచనలు వెళ్లాయని తెలిసింది.

శ్రీసత్యసాయి జిల్లా నుంచి 35 మంది...

పుట్టపర్తి రూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడ్డ వ్యక్తులను నెలరోజులపాటు జిల్లా బహిష్కరణ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలు జారీచేశారు. బహిష్కరణకు గురైన వారిలో అమరనాథరెడ్డి, ముకుందనాయుడు, బడముద్దల రంగయ్య, మహల్ అల్తాఫ్ ఖాన్, ఏటూరి శ్రీనివాసులు, వెంకటరమణ, ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, పూల శ్రీనివాసులరెడ్డి, పూల విజయ్‌కుమార్‌రెడ్డి, పందిపర్తి రామకృష్ణ, మొరిమిశెట్టి సురేష్, జ్వాలా గణేష్‌కుమార్ రెడ్డి, మట్టా చంద్రశేఖర్, బోయ శంకర్, బండిరవి, మీనుగ నాగరాజు, పొట్టి నరేంద్ర, మోటా రవీంద్ర, కమ్మశివశంకర్, దండు ఓబులేసు, ముత్యాలప్ప, తలారి చంద్రమోహన్, బోయ లక్ష్మానారాయణ, డైమండ్ ఇర్ఫాన్, శ్రీనివాసులు, హరి చెర్లోపలి, హరిజన బాబు, కొండకమర్ల నాగేంద్ర, ఎస్ శివ, మదుసూదన్‌రెడ్డి, లక్ష్మణరావు, బోయ రామాంజనేయులు, మారెప్ప, సాయికుమార్ ఉన్నారు.

రేయ్ రాజేష్.. లేవరా..

- ఈతకు వెళ్లి విద్యార్థి మృతి
- కన్నీరుమున్నీరైన తల్లి

'ఒరే రాజేష్.. ఒక్కసారి పైకిలేవరా. నన్ను చూడరా..! కాలేజీకి వారంలో వెళ్లాలంటివి.. ఇప్పుడే వస్తానని బయటకి పోతివి గదరా... పైకి లేవరా' అంటూ ఆ తల్లి గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. నార్పల పట్టణంలోని కొండంక వీధికి చెందిన విద్యార్థి రాజేష్(17) సోమవారం బావిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. మెకానిక్ గాండ్ల లక్ష్మీపతి, సుహాసిని దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్ అనంతపురంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. త్వరలో తరగతులు మొదలైతాయని, కాలేజీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఎప్పటిలాగే లక్షీపతి తోటకు వెళ్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చేశాడు. దీంతో ఎలాగైనా ఈతకు వెళ్లాలని తమ్ముడితో కలసి రాజేష్ తోటలోని బావి వద్దకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నెమ్మదిగా గట్టును పట్టుకుని బావిలో దిగడానికి ప్రయత్నిస్తూ.. జారి బావిలో పడ్డాడు. నీళ్లలో మునిగిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రాజేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. రాజేష్ తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

- నార్పల


మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, ఇన్‌సెట్‌లో రాజేష్ (ఫైల్)

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


రూపా నారాయణ స్వామి (ఫైల్)

యాడికి, జూన్3: అప్పుల బాధతో చేనేత కార్మికుడు రూపా నారాయణస్వామి (55) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన నారాయణస్వామి చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు భార్య లక్ష్మీదేవి చేనేత మగ్గానికి సంబంధించిన అచ్చులు అతికించే పనికి వెళ్లేది. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహం చేశారు. ఇటీవల కాలంలో కొత్త ఇంటిని నిర్మించుకున్నారు. రూ.4 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు తెలిపారు. పట్టు చీరల విక్రయాలకు అన్‌సీజన్ కావడంతో మగ్గం పనులు సరిగా జరగడం లేదని తెలిపారు. అచ్చులు అతికే పనులు కూడా పూర్తిగా తగ్గిపోయాయని తెలిపారు. నారాయణస్వామికి అప్పులు ఉండడం, ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మద్యం తాగేవాడని తెలిపారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతుండేవాడన్నారు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో చేనేత మగ్గానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. నారాయణస్వామి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోడకూలి విద్యార్థి మృతి


అఖిల్ (ఫైల్)

ఆత్మకూరు, జూన్ 3: మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తూ గోడకూలి బోయ అఖిల్ (18) అనే విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద ఎదురుగా ఉన్న గోడ సమీపాన రెండురోజులు క్రితం కొత్తగా కొనుగోలు చేసి తెచ్చిన ఎద్దులను శుభ్రం చేస్తుండగా గోడకూలిపోయింది. అక్కడే ఉన్న అఖిల్‌పై గోడ పడటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతపురంలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. సెలవులు కావడంతో తండ్రికి సాయంగా వ్యవసాయ పనులు చేసుకొంటున్నాడు. ప్రమాదంలో అతనితో పాటు రూ.లక్ష విలువ చేసే గాయపడింది. రెండు రోజులుక్రితం రూ.2 లక్షలు వెచ్చించి కోనుగోలు చేసిన ఎద్దులతో పాటు కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లితండ్రులు అంజి, లక్ష్మీదేవి, కూతుళ్ల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ గెలుపు కోసం పూజలు

అనంతపురం అర్బన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి... అధికారంలోకి రావాలని స్థానిక గీతా మందిరంలో మాజీ మేయర్ స్వరూప సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతోపాటు అనంత అర్బన్‌లో దగ్గుపాటి ప్రసాద్ భారీ మెజార్టీతో ఘన విజయం సాధించాలని దేవుణ్ని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు జయలక్ష్మి, లక్ష్మీదేవి, కృష్ణవేణి, వాణి, ప్రశాంతి, మంజుల, రమాదేవి, రంగమ్మ, శైలజ, సునీత, రాజేశ్వరి, నాగేంద్రమ్మ, జానకి పాల్గొన్నారు.


గీతామందిరంలో పూజలు చేస్తున్న స్వరూప, తెలుగు మహిళలు

గెలుపు మనదే...: దగ్గుపాటి

అనంతపురం అర్బన్: ఈ ఎన్నికల్లో గెలుపు టీడీపీదేనని, ఇందులో ఎవరూ ఎలాంటి అనుమానాలు, అపోహలు పెట్టుకోవద్దని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాబోతోందని, సర్వేలన్నీ అదే చెప్పాయని అన్నారు. ఇలాంటి నేపథ్యంలో కౌంటింగ్ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా సంయమనం పాటించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రత్యర్థులను ఉద్దేశించి ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుల నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే పోలీసులు, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

కూటమి గెలుపు ఖాయం

అనంతపురం సెంట్రల్: దేశంలో ఎన్‌డీఏ, ఏపీలో ఎన్‌డీఏ కూటమి విజయఢంకా మోగించబోతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయాన్ని ఆస్వాదిద్దామని, కార్యకర్తలు గొడవలు, అల్లర్లకు దిగొద్దని సూచించారు.

పరిటాల సునీత గెలవాలని...

ఆత్మకూరు: రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత గెలవాలని టీడీపీ మండల నాయకులు సోమవారం స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు కుందుల ఓబులపతి, రామదాసు, అక్కులన్న కార్తీక్ నందన్, తిక్కస్వామి, చిరంజీవి, పూల ఓబుళపతి, ఎర్రిస్వామి, కూరగాయల ఓబులపతి, పోతన్న పాల్గొన్నారు.

అవే కష్టాలు.. పడిగాపులు..!

పండుటాకులను వెంటాడిన పింఛన్ కష్టాలు.. నగదు డ్రా కోసం బ్యాంకుల వద్ద క్యూ



కళ్యాణదుర్గం రోడ్డు ఎస్‌బీఐలో రద్దీ... కళ్యాణదుర్గం రోడ్డు కెనరాబ్యాంకు వద్ద బయటనే కూర్చున్న పింఛన్‌దారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: అవే పరిస్థితులు... అదే కష్టాలు. అదే సీను.. పండుటాకులకు పింఛన్ కష్టాలు తప్పడం లేదు. ఒకటో తేదీ శనివారం ఆన్‌లైన్‌లో నగదు జమచేస్తామని పింఛన్‌దారులకు ప్రభుత్వం చెప్పింది. అయితే శనివారం సాయంత్రం వరకు చాలా వరకు బ్యాంకుల్లో జమకాలేదు. దీంతో శనివారం సాయంత్రం వరకు బ్యాంకుల వద్ద పడిగాపులు కాసిన వృద్ధులకు నిరాశే మిగిలింది. ఇక రెండో తేదీ ఆదివారం సెలవు కావడంతో మూడో తేదీ సోమవారం సగం మందికి బ్యాంకుల్లో జమచేశారు. బ్యాంకుల్లో ఆ సొమ్ము డ్రా చేసుకోవడానికి వచ్చిన వృద్ధులకు కష్టాలు ఎదురయ్యాయి. పండుటాకులు నగదు డ్రా కోసం ఎటువంటి ఇతర ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. నాలుగో తేదీ (మంగళవారం) సాధారణ ఎన్నికల కౌంటింగ్ కావడంతో సోమవారమే నగదు డ్రా చేసుకోవాలని వృద్ధులు బ్యాంకుల్లో బారులు తీరారు. జిల్లాకు 2,89,995 మందికి గాను రూ.86.80 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతాల్లోకి 1,98,919 మందికి రూ.59.67 కోట్లు జమచేయాల్సి ఉండగా సగం మందికి మాత్రమే చేశారు. ఇలా పండుటాకులను అటు ప్రభుత్వ అధికారులు, ఇటు బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

శింగనమల : పింఛన్ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమ కావడంతో.. సోమవారం పింఛన్‌దారులు బ్యాంకులకు క్యూ కట్టారు. దీంతో బ్యాంకులు కిటకిటలాడాయి. మండలంలో నాలుగు వేల మందికి పైగా పింఛన్‌దారులకు బ్యాంకులో సొమ్ము జమైంది. మండలంలోని శింగనమల, సలకంచెరువు, నాయనపల్లిక్రాస్, తరిమెల బ్యాంకుల్లో పింఛన్‌దారులు బ్యాంకుల్లో బారులు తీరారు. పింఛన్‌ను ఇంటింటికి పంపిణీ చేసే అవకాశమున్నా... రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


శింగనమల బ్యాంక్‌లో పింఛన్‌దారుల రద్దీ

విద్యాశాఖలో అదే నిర్లక్ష్యం...!

తపోవనం హిందీ స్కూల్ అసిస్టెంట్‌పై చర్యలు శూన్యం

అనంతపురం విద్య, జూన్ 3: ఏళ్ల తరబడి అడ్డగోలుగా డిప్యూటేషన్‌పై కొనసాగే టీచర్లపై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాశాఖాధికారులు అదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. తపోవనం జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న హిందీ స్కూల్ అసిస్టెంట్, మహిళా ఉపాధ్యాయులు గత కొంతకాలంలో అక్రమంగా డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. గత విద్యా ఏడాది ఆఖరి పని దినాన ఆమె ఇక్కడ రిలీవ్ అయ్యి. వెంటనే పాత స్కూల్‌లో విధుల్లో చేరాల్సి ఉంది. ఈ మేరకు ఆమె తపోవనం జడ్పీ హై స్కూల్ నుంచి రిలీవ్ అయిన తర్వాత... పాత స్కూల్ అయిన డీ హీరేహాల్ మండలం నాగలాపురంలో విధుల్లో చేరాల్సి ఉంది. పాత స్కూల్‌లో ఆమె విధుల్లో చేరలేదు. ఆమె కొన్నేళ్లుగా ఇక్కడే అక్రమంగా కొనసాగుతున్నారు. అయినా చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై విచారణ చేయిస్తామని, ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారి ప్రకటించారు. అయినా ఇప్పటి వరకూ ఆ టీచర్‌పై చర్యలు తీసుకోలేదు. జూన్ వచ్చేసింది. విద్యాసంవత్సరం మొదలుకానుంది. మరో ఎనిమిది రోజుల్లో స్కూళ్లు రీ ఓపెన్ కానున్నాయి. అయినా..... ఆమె డిప్యూటేషన్ నిబంధనలు ఉల్లంఘించినా... ఇప్పటి వరకూ జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో మాదిరే మళ్లీ ఆమెను తపోవనంలోనే కొనసాగించేలా అధికారులు, కొందరు సంఘాల నాయకులు యత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

నేడు ఎవరూ అనంతపురానికి రాకండి

రాప్తాడు, జూన్ 3: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, లెక్కింపు కేంద్రాలకు వెళ్లే ఏజెంట్లు తప్ప ఇతరులు ఎవరూ గ్రామాల నుంచి అనంతపురానికి రాకూడదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల సరిహద్దులు, రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, అత్యవసరమైన వారు మాత్రమే అనంతపురం వెళ్లేందుకు అనుమతి ఇస్తామని అన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిఘా వేస్తామని తెలిపారు. ఎక్కడ ఘర్షణ జరిగినా వెంటనే పోలీసులు రంగంలోకి దిగి కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా ఎవరైనా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శింగనమల : ఓట్ల లెక్కింపు అనంతరం సంబరాలు నిషేధమని సీఐ శ్రీధర్ ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురువారం వరకూ కోడ్ అమల్లో ఉంటుందని, కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కించపరిచే పోస్టులు పెడితే వారితో పాటు ఆ గ్రూపు అడ్మిన్‌పై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు.

గార్లదిన్నె : సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంతో ఎవరైనా నిబంధనలు ఉల్లఘింస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని ఇన్‌చార్జ్ డీఎస్పీ విజయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం సీఐ శ్రీధర్, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషాతో కలసి ఆయన గార్లదిన్నెతో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

రామగిరి: కౌంటింగ్ సందర్భంగా మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాలైన కుంటిమద్ది, కలికివాండ్లపల్లి, మాదాపురం, నసనకోట గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

చెన్నేకొత్తపల్లి : ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలో మంగళవారం పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు జరపరాదని, వాటిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మండలంలో ఇరుపార్టీల నుంచి ఒక్కొక్కరిని జిల్లా బహిష్కరణ చేసినట్టు తెలిపారు.

సబ్సిడీ విత్తనాన్ని దుర్వినియోగం చేస్తే రాయితీలు వర్తించవు

చెన్నేకొత్తపల్లి, జూన్ 3: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన వేరుశెనగను దుర్వినియోగపరిస్తే అలాంటి వ్యక్తులకు భవిష్యత్తులో రాయితీలు వర్తింపచేయబోమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ సుబ్బారావు తెలిపారు. మండలంలోని ముష్టికోవెల, గువ్వలగోవిందంపల్లి గ్రామాల్లో సోమవారం విత్తన వేరుశెనగ పంపిణీని ఆయన పరిశీలించారు. విత్తన నాణ్యత గురించి రైతులను అడిగితెలుసుకున్నారు. విత్తన నాణ్యత లేకుంటే వెనక్కి ఇవ్వాలని, మంచి విత్తనాన్ని తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ కృష్ణయ్య, ఏఓ ఉదయ్‌కుమార్ ఉన్నారు.

విజేతకు సన్మానం

అనంతపురం కల్చరల్, జూన్ 3: భీమవరం ఉమర్ అలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచిన కరణం హరికిశోర్‌ను సోమవారం జిల్లా కేంద్రం గ్రంథాలయంలో సన్మానించారు. డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి గౌరవ సలహాదారుడు, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ మాట్లాడుతూ.. హరికిశోర్ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవి రియాజుద్దీన్, సాహిత్యభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణ, తోట నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో త్వరలో అత్యవసర వైద్య విభాగం

అనంతపురం టౌన్, జూన్ 3: జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందించడానికి అత్యవసర విభాగాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక ప్రొఫెసర్, ఒక అసోషియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంటు ప్రొఫెసర్లు ఈ విభాగంలో ఉంటూ వైద్యసేవలు అందిస్తారన్నారు. ఆర్ఎంఓల పర్యవేక్షణలో ఈ విభాగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు వైద్యులు పద్మజ, హేమలత, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో జిల్లా హ్యాట్రిక్ విజయం


చక్రిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు హ్యాట్రిక్ విజయం సాధించింది. ఈ పోటీలను సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. అనంతపురం, కడప జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 11.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 71పరుగులతో విజయం సాధించింది. అనంత బౌలర్ చక్రిక రెండు వికెట్లు తీసుకోవడంతో పాటు 18 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది.

50,649 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 3 : జిల్లాలోని ఆర్బీకేల్లో తొమ్మిదో రోజైన సోమవారమూ విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 57,184 మంది రైతులకు 50,649 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 74,588 మంది రైతులు 65,866 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు

శింగనమల జూన్ 3: చంద్రబాబునాయడు ముఖ్యమంత్రి కావాలని, శింగనమల కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గెలవాలని శింగనమల నియోజకవర్గం పరిశీలికుడు గుర్రప్పనాయుడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి కసాపురంలో పూజలు చేశారు. సోమవారం ఈ మేరకు వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

దగ్గుపాటి ప్రసాద్‌కు సన్మానం


దగ్గుపాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 3: దగ్గుపాటి ప్రసాద్‌ను యువజన కాలనీలోని అభయ ఆంజనేయస్వామి ఆలయం కమిటీ సభ్యులు సన్మానించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆలయంలో సోమవారం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి ఆంజనేయస్వామి ఫొటో అందజేసి సన్మానించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అంతా శుభం కలగాలని, ఈ ఎన్నికల్లో విజయం సాధించాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాయల్ వెంకటేష్, ఆలయ కోశాధికారి రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మారుతీప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, జూన్ 3: గార్లదిన్నెకు చెందిన బెస్త నవీన్‌కుమార్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన రిమాండ్‌కు తరలించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు గార్లదిన్నెకు చెందిన నవీన్‌కుమార్ మాయమాటలు చెప్పి మూడు రోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. దీనిపై బాలిక, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆ నవీన్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు.

బీకేఎస్ ఉన్నత పాఠశాలలో చోరీ

బుక్కరాయసముద్రం, జూన్ 3: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 50 వేల విలువ చేసే సైన్సు ల్యాబ్ మెటీరియల్ చోరీ అయినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు వసుంధర సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాలలోని సైన్సు ల్యాబ్ సామగ్రిని ప్రభుత్వం ఇటీవలే పాఠశాలకు పంపిందని, గుర్తు తెలియని వ్యక్తులు ఆ గది తాళం పగలకొట్టి అందులో ఉన్న సామగ్రిని ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎన్నికల లెక్కల్లో అవినీతి తేల్చరా...?

- బొక్కిన వారిపై నేటికీ చర్యలు శూన్యం
- ఉన్నతాధికారులకూ ముడుపులు...?



అనంతపురం క్రైం, జూన్ 3 : కౌంటింగ్ ముగుస్తున్నా ఎన్నికల నిధులపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందికి ఇప్పటికీ రెమ్యునరేషన్ అందలేదు. అటు నిధులను బొక్కిన వారిపై చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేంటో అంతుబట్టడం లేదు. రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంపై బీఎల్‌ఓలు, ఇతర ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో లాగే ఈ సారీ రెమ్యునరేషన్ ఇవ్వకుండా చేతులెత్తేస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల విధులకు సంబంధించి రూ.1,47,89,000 కేటాయించారు. పీఓలు, ఏపీఓలు, కొందరు సిబ్బందికి మాత్రమే రెమ్యునరేషన్ అందింది. బీఎల్‌ఓలకు కేవలం రెండు రోజుల విధులకు సంబంధించి మాత్రమే అందజేశారు. కాగా ఇంకా రూ.1.23 కోట్లు అదనంగా నిధులు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపడం విడ్డూరం. కంప్యూటర్లు, షామియానాలు, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, ఆటోలు, కార్ల బాడుగల విషయంలో కాంట్రాక్టు తమ అనుయాయులకు ఇచ్చి దొంగ బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

బినామీ లెక్కల అధికారి...

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు ఎన్నికల నిధులు తినేశారనే ఆరోపణలున్నాయి. కింది స్థాయి ఉద్యోగి పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాలో నుంచి ఒకే సారి రూ.20 లక్షలు డ్రా చేయించినట్లు సమాచారం. కాంట్రాక్టర్‌గా అతని పేరును పెట్టినట్లు తెలుస్తోంది. మరోసారి రూ.2 లక్షలు, ఇంకోసారి రూ.1.50 లక్షలు అతని బ్యాంకు ఖాతాకు మళ్లించినట్లు సమాచారం. కీలకంగా వ్యవహరిస్తున్న ఆ ఇద్దరు అధికారులే ఎన్నికల నిధుల నుంచి రూ.50 లక్షలు తమ జేబుల్లోకి మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా ఓ అధికారి రూ.10 లక్షలుపైగా విలువ చేసే బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం.

బొక్కిన వారిపై చర్యలు శూన్యం

ఎన్నికల విధులకు సంబంధించి రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంతో బీఎల్‌ఓలు, నగరపాలిక సిబ్బంది అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. అటు ఉన్నతాధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు కొన్ని రోజులుగా ఎన్నికల నిధులు బొక్కేశారని ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు దేనికెంత ఖర్చు చేశారో స్పష్టత ఇవ్వలేకపోవడం గమనార్హం. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోకపోవడంలో ఉన్న అంతర్యమేంటో అంతుబట్టడం లేదు. ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారా...? లేక ఇందులో వారికీ ముడుపులు అందాయా..? అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

జేఎన్‌టీయూకు పోస్టల్ బ్యాలెట్ల తరలింపు


శింగనమల నుంచి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న అధికారులు

శింగనమల జూన్ 3: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్లను కౌంటింగ్ నిమిత్తం అనంతపురంలోని జేఎన్‌టీ యూకు అధికారులు సోమవా రం తరలించారు. నియోజక వర్గంలో మొత్తం 430 మందికి పోస్టల్ బ్యాలెట్లు ఉండగా.. 220 బ్యాలెట్లు తహసీల్దార్ కార్యాల యానికి చేరాయి. వాటిని సోమవారం సాయంత్రం ఎన్ని కల అధికారులు లోకేశ్వరి, విజయ్‌కుమార్ పోలీస్ బందోబ స్తు మధ్య జేఎన్‌టీయూకు తరలించారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత కడప

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజేతగా నిలిచింది. సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు కొనసాగాయి. అనంతపురం, కడప జట్ల మధ్య మ్యాచ్ జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 24 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 143 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 23.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించింది. దీంతో కడప మూడు వికెట్ల తేడాతో గెలిచింది. గురు విగ్నేష్ 90 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. మరో మ్యాచ్‌లో... చిత్తూరు, కర్నూలు జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు 26 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 26 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన 88 పరుగులు సాధించిన లక్ష్మీనారాయణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. పాయింట్ల ఆధారంగా కడప జట్టును టోర్నీ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.


విజేత కడప జట్టు


సోమనాథ్ నగర్‌లో చెత్తా చెదారంతో నిండిన కాలువ


రోడ్డుపై గుంతల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు

ఎక్కడ చూసినా
బురద... బురద..!

అనంతపురం క్రైం, జూన్ 3: అనంతపురం నగరంలో కురిసిన వానకు ఎక్కడ చూసినా మురుగునీరు.. బురదే. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వర్షపు నీరు, మురుగునీరు ఏకమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ నీటిమయమయ్యాయి. రాప్తాడు పండమేరు వంకలో వర్షపు నీరు చేరింది. సప్తగిరి, రాజురోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నీరు నిలిచాయి. సోమవారం సాయంత్రం వరకు అదే పరిస్థితి. సోమనాథ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లలో గుంతలు పడటం, వాటిలో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సోమనాథ్‌నగర్‌లోని వంకలో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు స్తంభించింది. మంగళవారి కాలనీ తదితర ప్రాంతాలు బురదమయంగా మారాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో మురుగునీరు స్తంభించి వర్షపునీరు రోడ్లపై పారింది.

ఆర్టీసీ ప్రాంగణంలో నిల్వ ఉన్న వర్షపు నీరు




సప్తగిరి సర్కిల్, రాజు రోడ్డులో నిల్వ ఉన్న వర్షపు నీరు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

డీఐజీ రాహుల్‌దేవ్‌శర్మ


పెద్దవడుగూరు స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఐజీ

యాడికి, జూన్ 3: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఐజీ రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. సోమవారం యాడికి పోలీస్‌స్టేషన్‌కు ఆయన వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన అల్లర్లు, గొడవలు, ప్రస్తుత పరిస్థితులపై సీఐ నాగార్జునరెడ్డితో వివరాలు ఆరాతీశారు. కోనుప్పలపాడు, గుడిపాడు, రాయలచెరువువంటి సమస్యాత్మక గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెక్షన్ 144అమలులో ఉంటుందన్నారు. అనవసరంగా ఎవరూ బయటకు రాకూడదని సూచించారు. పోలీసు నిబంధనలను పాటించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు.

హద్దుమీరితే కఠిన చర్యలు

పెద్దవడుగూరు: ఎన్నికల ఫలితాల అనంతరం హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని డీఐజీ రాహుల్‌దేవ్‌శర్మ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తే తాటతీస్తామన్నారు. రౌడీషీటర్లు, అల్లరి మూకలపై పోలీసుల నిఘా ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గొడవలు చేస్తే రౌడీషీట్: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 3: గొడవలు, అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. పోలీసులు ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన డీఎస్పీ

రాయదుర్గంరూరల్: కేటీఎస్ డిగ్రీ కాలేజ్ వద్ద గల వైఎస్సార్ సర్కిల్లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ చేశారు. అనంతపురంలో ఎన్నికల కౌంటింగ్ కార్యక్రమంలో భాగంగా వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. వాహనాల రికార్డులను తనిఖీ చేసి, వాహనదారులకు పలు సూచనలు చేసి పంపారు.

తాడిపత్రిలో పటిష్ట బందోబస్తు


మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దన్ నాయుడు

తాడిపత్రిటౌన్, జూన్ 3: కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలో పటిష్ట బందోస్తు ఏర్పాటుచేసినట్లు డీఎస్పీ జనార్దన్‌నాయుడు పేర్కొన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గతంలో జరిగిన దాడులను దృష్టిలో ఉంచుకొని పట్టణ సరిహద్దులోని నాలుగు రహదారుల్లో ఏడు చెక్‌పోస్టుల ద్వారా అష్టదిగ్బంధం చేశామన్నారు. 48 పికెట్‌లు, 19మొబైల్ టీం, 23 టూవీలర్ మొబైల్ టీంలను అదనంగా వినియోగిస్తున్నామన్నారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే మొబైల్ టీంలు చేరుకుంటాయన్నారు. గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తుగా వందలాదిమందిని బైండోవర్ చేశామన్నారు. 60మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి గ్రామ బహిష్కరణకు నోటీసులు పంపామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 467మంది బందోబస్తులో పాల్గొంటుండగా పట్టణంలోనే 337మంది పహారా కాస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా పాల్గొన్నారు.


పోలీసు బలగాల కవాతు


గుంతకల్లులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

గుంతకల్లుటౌన్, జూన్ 3: పట్టణంలో జిల్లా ఏఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పోలీసు బలగాల కవాతు నిర్వహించారు. స్థానిక బీరప్ప సర్కిల్, అజంతా సర్కిల్, లేపాక్షి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ధర్మవరం గేట్‌రోడ్డు, ఆర్అండ్‌బీ బంగ్లా, హనుమాన్ సర్కిల్‌లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 144సెక్షన్, 30యాక్ట్ అమల్లో ఉందన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: ఎన్నికల కౌంటింగ్ రోజున నింబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్, కర్నూలు రోడ్డు, గాంధీ సర్కిల్, రాజీవ్ సర్కిల్ వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

యాడికి, జూన్8: మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దామని ప్రభుత్వ వైద్యులు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్ పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం యాడికిలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ జూన్ 1నుంచి 30వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమకాటు వలన సంక్రమించే మలేరియా వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ర్యాలీలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది జుబేదా, లక్ష్మీదేవి, రాంప్రసాద్‌గౌడ్, మద్దిలేటి, స్వర్ణలత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పాల్తూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ యూనిట్ మలేరియా అధికారి భక్తుల కోదండరామిరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి స్థానిక బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ కుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీపాండురంగస్వామి రథోత్సవం


ఉంతకల్లులో భారీ జనసందోహం మధ్య శ్రీవారి రథోత్సవం

బొమ్మనహాళ్, జూన్ 3: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణి పాండురంగస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. వేకువజామునే సుప్రభాత సేవ, మంగళ వాద్యం, కలశాలతో గంగాజలం తీసుకువచ్చి అభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, నిర్మాల్య విసర్జన, అష్టోత్తర, విశేష పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు పండరీపుర పీఠాధిపతి గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో రుక్మిణీపాండురంగస్వామి విగ్రహాలను రథంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం భారీ జనం సందోహం మధ్య రథోత్సవం నిర్వహించారు. స్థానిక పాండురంగ స్వామి ఆలయం, గ్రామ ప్రధాన వీధి నుంచి బసవన్న ఆలయం వరకు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఆంధ్ర కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు విఠల విఠల.. రుక్మిణీ పాండురంగ విఠల అంటూ రథోత్సవం ముందు భజనలు చేస్తూ ముందుకు సాగారు. రాత్రి ఆలయ సన్నిధిలో స్వామివారికి పల్లకి మహోత్సవమును నిర్వహించారు. శ్రీవారి రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బొమ్మనహాళ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

●డీసీఎం శ్రీరాములు


పొగాకు నిరోధక దినం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కుందుర్పి, జూన్ 3: పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని డీసీఎం శ్రీరాములు తెలిపారు. మండలంలోని ఎనుములదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎం పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే దుష్ప్రభావాల పట్ల అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, గుట్కా, ఖైని లాంటివి అలవాటు చేసుకుంటే అవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. వీటి వలన ఎన్నో రకాలైన క్యాన్సర్లు, శ్వాసకోశ వ్యాధులు, దంత సమస్యలు, గుండె జబ్బులు, సెక్సువల్ సమస్యలు వస్తాయని అవగాహన కల్పించారు. దీర్ఘకాలికంగా పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గి మధుమేహం లాంటి జబ్బులు బారిన పడాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో పొగాకు వ్యతిరేక దినం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌వో హెల్త్ ఎడ్యుకేటర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మందు కోసం...


మద్యం షాపువద్ద మందుబాబులు

ఉరవకొండ, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం చేపట్టనున్నారు. ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలను ఈ నెల 4, 5 తేదీల్లో మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో సోమవారం ఉదయం 11గంటలకు దుకాణం తీయక ముందే మందుబాబులు బారులు తీరారు. ఉరవకొండతో పాటు ఆమిద్యాల, పాల్తూరు గ్రామాల్లోని ప్రభుత్వ దుకాణాలు కిటకిటలాడా యి. మద్యం కొనుగోలు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అని చెప్పడంతో మద్యం కొనేందుకు మందు బాబులు ఇబ్బందులు పడ్డారు. ఇదే అదునుగా మద్యం షాపుల్లోని సిబ్బంది అధిక ధరలకు అమ్మి సొమ్ముచేసుకున్నారు. ప్రధానమైన బ్రాండులను పక్కన నిల్వ చేసి అధికారపార్టీ నాయకులకు మాత్రమే అమ్మినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, జూన్ 3: మండలంలోని యంగన్నపల్లి గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో నవీన్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బేతాపల్లి గ్రామానికి చెందిన నవీన్ ద్విచక్రవాహనంలో గుత్తికి వస్తుండగా గ్రామాశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడ్డాడు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హుండీ సొమ్ము లెక్కింపు

ఉరవకొండ,జూన్3: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ సొమ్మును సోమవారం లెక్కించారు. బ్రహోత్సవాల అనంతరం ఆరు శాశ్వత హుండీలను పర్యవేక్షణ అధికారి అక్కిరెడ్డి, ఈవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తెరచి లెక్కించారు. 17రోజులకు గానూ రూ.17.21లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్నదానం సత్రం హుండీ ద్వారా రూ.3,611లు హుండీ ఆదాయం వచ్చిందన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్లూరు, జూన్3: మండలవ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ అంతరాయంతో పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకున్నారు.

విద్యుత్ తీగలు పడి జింక మృతి


జింక కళేబరం

కళ్యాణదుర్గం, జూన్ 3: శెట్టూరు మండలంలోని ఎర్రబోరేపల్లిలో ఓ రైతు తోటలో విద్యుత్ తీగలు తెగిపడి సోమవారం ఓ జింక మృతి చెందింది. అటుగా వెళ్లిన పాదచారులు ఈ విషయాన్ని వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. ట్రాన్స్‌కో అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అనంతరం వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించి జింక మృతికి గల కారణాలను ఆ ప్రాంత రైతులతో తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులు మృతి చెందిన జింకకు పోస్టుమార్టమ్ నిర్వహించారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాం

పుట్లూరు, జూన్3: పుట్లూరు, యల్లనూరు మండలాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లో 10 పోలీసు మొబైల్ వాహనాలు, 70మంది బీఎస్ఎఫ్ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో నిరంతరం డ్రోన్ కెమెరాలతో సిబ్బంది నిఘా పెట్టారన్నారు. టీడీపీ, వైసీపీ నాయకులు తాడిపత్రి, అనంతపురం వెళ్లకుండా ఇళ్లల్లోనే ఉండాలన్నారు. పరిధి దాటితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలాల్లో బాణసంచా కాలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంపచెట్ల తొలగింపు

పామిడి, జూన్ 3: మండలంలోని ఎద్దులపల్లి-పాళ్యం రోడ్డుకు గల కంపచెట్లను ఎద్దులపల్లి వాసి వీరాంజనేయులు ఎక్స్‌కవేటర్‌తో సోమవారం తొలగించారు. వర్షాకాలం రానుండటంతో రోడ్డుకు ఇరువైపులా గల కంపచెట్ల వల్ల వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పాళ్యం పొలిమేర వరకూ కంపచెట్లును తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్య


శిల్ప (ఫైల్)

బెళుగుప్ప, జూన్ 3: మండలంలోని గుండ్లపల్లికి చెందిన శిల్ప (33) సోమవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటకలోని చిత్రదుర్గంకు చెందిన శిల్పకు బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన మంజుతో ఐదేళ్ల క్రితం వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంజు బేల్దారి పని నిమిత్తం గుండ్లపల్లికి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. కుటుంబ సభ్యులు, భర్త, అత్తమామల వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

మండలం విడిచి వెళ్లకండి: సీఐ

యల్లనూరు, జూన్3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మంగళవారం ప్రజలు మండలాన్ని వదిలి వెళ్లరాదని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం బాణసంచా కాల్చ డం నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఆయన హెచ్చరించారు. మండలంలో గస్తీకి మొబైల్ టీంలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నిజాయతీ చాటుకున్న కోచ్ క్లీనర్

రైల్వే స్టేషన్‌లో దొరికిన బ్యాగ్ పోలీసులకు అప్పగింత


దొరికిన బ్యాగ్‌ను అరుణకు అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

గుంతకల్లు, జూన్3: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ మరచిపోయిన బ్యాగ్‌ను చిరంజీవి అనే కోచ్ క్లీనర్ పోలీసులకు అప్ప గించి నిజాయతీని చాటుకున్నాడు. బ్యాగ్‌ను అందులోని నగదు, బంగారు ఆభరణాలను సొంతదారురాలికి జీఆర్పీ పోలీసులు సోమవారం అందజేశారు. ఈ నెల 2న పట్టణంలోని సిద్ధేశ్వరనగర్‌కు చెందిన అరుణ తన భర్త, బంధువులు విజయవాడకు వెళ్తున్నందున రైల్వే స్టేషనుకు వచ్చి వారికి వీడ్కోలు పలికింది. రాత్రి 8 గంటల సమయంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ బయలుదేరగా అరుణ ప్లాట్‌ఫారంపై తన బ్యాగ్‌ను మరచిపోయి ఇంటికి వెళ్లిపోయింది. పట్టణంలోని బెంచికొట్టాలకు చెందిన ఏసీ కోచ్ క్లీనర్ చిరంజీవి ప్లాట్‌ఫారంపై వెళ్తూ బ్యాగ్‌ను గుర్తించి అందులో డబ్బు, బంగారు ఆభరణాలు ఉండటంతో జీఆర్పీ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్‌హెచ్ఓ మహేంద్రకు అప్పగించాడు. అందులో రూ. 3,300లు, ఒక బంగారు చైను, ఒక వెండి చైను ఉండటంతో ఆ బ్యాగు ఎవరిదనే విషయంగా విచారణ జరిపి అరుణకు సమాచారాన్ని అందజేశారు. ఆమెను సోమవారం జీఆర్పీ స్టేషనుకు పిలిపించి బ్యాగును, అందులోని సొమ్మును అప్పగించారు. ఏసీ కోచ్ క్లీనర్ చిరంజీవి నిజాయతీని ప్రశంసించిన అరుణ రూ.వెయ్యిని బహుమానంగా అందజేశారు. జీఆర్పీ పోలీసులు చిరంజీవిని అభినందించారు.

సూర్యుడి విగ్రహాన్ని ఇచ్చేయండి: ఏడీఏ


పొలంలో దొరికిన సూర్యదేవుని విగ్రహం(ఫైల్)

గుమ్మఘట్ట, జూన్ 3: సూర్యుడి విగ్రహాన్ని స్వాధీనం చేయాలని పురావస్తు శాఖ ఏడీఏ రజిత మండలంలోని కలుగోడు గ్రామస్థులను కోరారు. వేదవతి హగరి ఒడ్డున కొన్నాళ్ల కిందట రైతు నాగేంద్ర పొలం దున్నుతుండగా రెండు అడుగుల సూర్యదేవుడి విగ్రహం బయట పడిన విషయం తెలిసిందే. అప్పట్లో రెవెన్యూ అధికారులు ఫిర్యాదు మేరకు గ్రామాన్ని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించి, స్వాధీనపరచుకునేందుకు ప్రయత్నించగా గ్రామప్రజలు, స్థానిక రాజకీయ నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలో ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని చెప్పడంతో అధికారులు వెళ్లిపోయారు. అప్పటి నుంచి విగ్రహాన్ని కలుగోడు గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో నవధాన్యాల నడుమ ఒక పెట్టెలో గ్రామప్రజలు భద్రపరిచి ఉంచారు. అయితే ఇప్పటిదాకా ఆలయ నిర్మాణం చేపట్టకపోవడం పట్ల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. స్పందించిన కలెక్టర్ రెండునెలల్లోగా సూర్యదేవుని విగ్రహంపై పూర్తిస్థాయి నివేదిక కళ్యాణదుర్గం ఆర్డీఓకు అందించాలని ఆదేశించారు. దీంతో రెండురోజుల క్రితం తాము కలుగోడు గ్రామాన్ని సందర్శించి ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న సూర్యదేవర విగ్రహాన్ని స్వాధీన పరచుకునేందుకు ప్రయత్నించినట్లు ఏడీఏ రజిత వెల్లడించారు. గ్రామ పెద్దలు వారంరోజులు గడువు ఇవ్వాలని తాము గ్రామంలో చర్చించుకుని విగ్రహం అప్పగించేందుకు అనుమతిస్తామని తెలియజేసినట్లు ఆమె తెలిపారు.

అమిలినేని విజయం కోసం ప్రత్యేక పూజలు


దేవాలయం వద్ద టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, జూన్ 3: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు గెలవాలంటూ పట్టణంలోని అక్కమాంబ దేవాలయంలో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో అమిలినేని భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

యల్లనూరు, జూన్ 3: మండల సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన దాసప్ప ఆంజనేయులు (46) మృతి చెందాడు. ఆంజనేయులు సోమవారం ఉదయం ట్రాక్టర్‌లో కట్టెలు తోలడానికి యల్లనూరు నుంచి బయల్దేరాడు. మండల సరిహద్దులోని వెనుకయ్య కాలువ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పడంతో ఆంజనేయులు కిందపడి నలిగిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతితోపాటు ముగ్గురు సంతానం ఉన్నారు.

18 నుంచి డిగ్రీ అడ్మిషన్లు

రాయదుర్గంరూరల్, జూన్ 3: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్స్ ఈనెల 18 నుంచి ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామమూర్తి సోమవారం ప్రకటనలో తెలియజేశారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి సింగిల్, మేజర్ సబ్జెక్టులు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మైక్రో బయాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బాటనీ నందు కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు కళాశాలను సందర్శించి అప్లికేషన్ పొంది పూర్తి చేసి కళాశాలలో అందజేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

గుంతకల్లుటౌన్, జూన్ 3: పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి జూనియర్ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా వరప్రసాద్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న బ్రహ్మానందరెడ్డి ఉద్యోగ విరమణ చేశాడు. కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న వరప్రసాద్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించాలని కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ ఉత్తర్వులను జారీ చేశాడు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ వరప్రసాద్‌కు శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, విశ్రాంత ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా అక్కదేవతల వేడుకలు


అక్క దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

కూడేరు, జూన్ 3: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో అక్కమ్మ దేవతల వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కమ్మ దేవతలకు వివిధ రకాల పుష్పలతో అలకంరిచారు. హైదరాబాద్‌కు చెందిన మలోబన్న అక్కమ్మ దేవతల వేడులను నిర్వహించారు.

టీడీపీ విజయం కోసం పూజలు

గుంతకల్లు, జూన్3: రాష్ట్రంలో టీడీపీ, గుంతకల్లులో తన తండ్రి గుమ్మనూరు జయరాం గెలుపు సాధించాలని ఆకాంక్షిస్తూ గుమ్మనూరు ఈశ్వర్ బళ్లారిలోని దుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం బళ్లారి దుర్గమ్మ దేవాలయానికి వెళ్లిన ఈశ్వర్ మంగళవారం ఎన్నికల కౌంటింగ్‌లో టీడీపీ విజయాన్ని అందుకోవాలని అమ్మవారిని మెక్కుకున్నారు. అర్చకులు ఈశ్వర్‌చే పూజలు చేయించి, ఆశీర్వచనం పలికారు.

ఉపాధ్యాయుడికి తప్పిన ప్రమాదం


ద్విచక్రవాహనాన్ని బయటకు తీస్తున్న యువకులు

పెద్దవడుగూరు, జూన్ 3: మండల కేంద్రంలోని పందుల వాగు దాటే క్రమంలో ఉపాధ్యాయుడు కుమార్ ద్విచక్రవాహనం సహా నీటిలో కొట్టుకుపోయాడు. వాగులో ఉన్న ముళ్ల పొదలను పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. మండల కేంద్రానికి చెందిన కుమార్ ఎన్నికల విధుల నిమిత్తం ద్విచక్రవాహనంలో అనంతపురం బయల్దేరాడు. వాగు దాటే సమయంలో వాన నీటి ఉధృతి పెరగడంతో ద్విచక్రవాహనంతో నీటిలో కొట్టుకుపోయాడు. ముళ్ల చెట్ల సాయంతో గట్టుకు చేరుకున్నారు. ఉధృతి తగ్గిన తర్వాత స్థానికులు ద్విచక్రవాహనాన్ని బయటకు తీశారు.

144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు

బెళుగుప్ప, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా మండలంలో మంగళవారం 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్ఐ శివ సోమవారం హెచ్చరించారు. ఈక్రమంలోనే వ్యాపార దుకాణాలు బంద్ చేసుకుని ప్రశాంత వాతావరణం నెలకొనేలా సహకరించాలని ఆయన ప్రజలకు సూచిస్తూ నోటీస్‌లు అందజేశారు. ఎక్కడా గుంపులుగా ఉండకూడదన్నారు. అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న సంస్థ సభ్యులు

గుంతకల్లుటౌన్, జూన్ 3: మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని భారత రాజ్యాంగ అవగాహన వేదిక అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని సోనియా గాంధీ కాలనీలో సోమవారం భారత రాజ్యాంగ అవగాహన వేదిక, హార్ట్ ఫుల్ నెస్ సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. సమస్త మానవాళికి ప్రాణవాయువు అందించగలిగేవి మొక్కలు మాత్రమేనన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చొక్కాసునీల్‌కుమార్, వీరేష్, జింకల సరస్వతి, దివ్య, భార్గవి, ప్రణతి, కృష్ణమూర్తి, ఆంజనేయులు, వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.